

చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,060
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.69,000
రిటైల్ వెండి గ్రాము	రూ.71

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	29	18
తిరుపతి	29	20
తిరుమల	24	16
గూడూరు	30	22
నగరి	31	21



ముక్కంటి హుండీకి రూ.1.98 కోట్లు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి హుండీని బుధవారం లెక్కించగా రూ.1,98,43,982 ఆదాయం వచ్చినట్లు ఈఓ సాగర్‌బాబు తెలిపారు.

■ ప్రజలు కష్టాల పాలైనా ప్రభుత్వంపై బురద చల్లాలి.. ఎన్ని ప్రాణాలు పోయినా పంతం నెగ్గించుకోవాలి.. ఇదే లక్ష్యంతో కుట్ర రాజకీయాలకు తెరతీస్తున్న ప్రతిపక్ష నేత చంద్రబాబు వైఖరిని చూసి కుప్పంవాసులు నివ్వెరపోతున్నారు. 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఘనుడికి సభలు, రోడ్‌షోలకు అనుమతి తీసుకోవాలని కూడా తెలియదా..? 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే అనుభవజ్ఞుడికి పోలీసు నిబంధనలపై కనీసం అవగాహన లేదా..? ఈ పెద్దమనిషినా మనం ఇన్నేళ్లపాటు మోసింది.. అని నియోజకవర్గ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.ప్రశాంతంగా బతకనీయకుండా ఇదేం రు'బాబు' అంటూ మండిపడుతున్నారు.

ఇదేం రుబాబు!



పోలీసులపై విరుచుకుపడుతున్న బాబు

- చంద్రబాబు పర్యటనపై కుప్పం వాసుల కలవరం
- కిరాయి మూకల అల్లర్లపై భయం

సాక్షి, చిత్తూరు/కుప్పం/శాంతిపురం : జనం ఊహించినట్టుగానే చంద్రబాబు కుప్పం మూడురోజుల పర్యటనలో తొలిరోజు టీడీపీ నాయకులు ఉద్రిక్త వాతావణం సృష్టించడంపై అంతా మండిపడుతున్నారు. తాము ఎప్పుడూ స్థానికంగా చూడని వ్యక్తులు మంగళవారం ఉదయం పసుపు కండువాలు ధరించి ప్రత్యక్షం కావడంతోనే మళ్లీ అరాచకాలు సృష్టిస్తారని సామాన్య జనం భయాందోళనకు గురయ్యారు. ఆ ప్రకారమే ఉదయం 10 గంటల నుంచి చంద్రబాబు వచ్చే 4 గంటల వరకు తెలుగుతమ్ముళ్ళు ఎక్కడికక్కడ వీరంగం చేస్తూ కనిపించారు. కందుకూరు, గుంటూరు ఘటనలు పునరావృతం కాకూడదని జాగ్రత్తలు తీసుకుంటున్న పోలీసులపైనే టీడీపీ కార్యకర్తలు దాడికి దిగడం, పిడి గద్దులు గుద్ది నెట్టి పడేయడం చూసి జనం వణికిపోయారు. ఇదేం ఖర్మ అంటూ చంద్రబాబుపై దుమ్మెత్తిపోస్తున్నారు.

అర్ధరాత్రి వరకు పర్యటన

చంద్రబాబు మొదటిరోజు పర్యటన బుధవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. నిర్ణీత సమయం కంటే ఆరు గంటలు ఆలస్యమైంది. రాత్రి 11 గంటల వరకు 121 పెద్దూరు వీధుల్లో పర్యటించారు. అక్కడి నుంచి కుప్పం చేరుకున్నారు.



వీరంగం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు





కర్రతో కార్యకర్త, బారికేడ్లు ధ్వంసం చేస్తున్న టీడీపీ శ్రేణులు

7న జడ్జి పోస్టుల భర్తీకి పరీక్ష

చిత్తూరు అర్బన్: సివిల్ జడ్జి ఉద్యోగాల భర్తీకి ఈనెల 7వ తేదీన పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావ్ తెలిపారు. తిరుపతిలోని మూడు పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయని, అభ్యర్థులు పరీక్ష సమయానికి కంటే ముందే కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుందన్నారు. వెంట హాల్‌టికెట్‌తోపాటు గుర్తింపు కార్డు కూడా ఉండాలని పేర్కొన్నారు.

సంక్షేమం.. పేదరికమే ప్రామాణికం

- కరోనాతో తగ్గిన ఆదాయం
- ఆగని పథకాలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సోమల(పుంగనూరు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదరికమే కొలమానంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడం జరుగుతోందని రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం సోమల మండలంలో పల్లెబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నంజంపేటలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అక్కడ జరిగిన సభలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే కరోనా మహమ్మారి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ఆ సమయంలో రాష్ట్ర ఆదాయం పూర్తిగా తగ్గిందన్నారు. కానీ ప్రజలకు ఇచ్చిన మాట మేరకు క్యాలెండర్ ప్రకారం సంక్షేమ పథకాలను అందించామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేద రోగులకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని చెప్పారు. అలాగే నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలుగా అభివృద్ధి చేశామన్నారు. పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్, మెనూ ప్రకారం భోజనంతోపాటు ప్రపంచంలో ఎవరితోనైనా తలపడేలా పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారని చెప్పారు. కార్ల్‌మార్క్స్ చెప్పినట్లు పేదకుటుంబాలు అభివృద్ధి చెందాలంటే విద్య అవసరమన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో 98 శాతం హామీలను నేరవేర్చి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రికార్డు సృష్టించారని మంత్రి తెలిపారు. చంద్రబాబు ఎన్నికల హామీలను ఒకటి కూడ అమలు చేయకుండా మహిళలు, రైతులను మోసగించారని ఎద్దేవా చేశారు. మన కుటుంబాన్ని ఆదుకునే వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలిచి, ఆయనకు అందరూ ఆశీర్వాదాలు అందించాలని కోరారు.



నూతన పెన్షన్లు పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తాగు, సాగునీటికి ప్రాజెక్టుల ఏర్పాటు

ప్రజలకు తాగు, సాగునీరు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పట్టుదలతో ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. తంబళ్లపల్లె, పుంగనూరు, సోమల మండలాల్లో రిజర్వాయర్ల నిర్మాణం చురుగ్గా సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం గండికోట నుంచి పైపులైన్ల ద్వారా పుంగనూరుకు నీటిని తరలించే కార్యక్రమం త్వరలోనే పూర్తి అవుతుందని చెప్పారు. అలాగే హంద్రీనీవా కాలువను విస్తరించి, అన్ని చెరువులకు నీటిని తరలించి, రైతులు, ప్రజలకు తాగు, సాగునీటి సమస్య లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అందరు సంతోషంగా ఉన్నారని చెప్పారు. మండలంలోని ఆవులపల్లె రిజర్వాయర్ పనులు కొనసాగుతున్నాయని, వచ్చే వర్షాకాలం నాటికి పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పనులు పూర్తయితే మండంలోని అన్ని చెరువులకు సాగునీరు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ ఈశ్వరయ్య, బోయకొండ ఆలయ చైర్మన్ మిద్దింటి శంకరనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంగాధర రాయల్, సంయుక్త కార్యదర్శి ఆకుల గజేంద్ర, అమాస మోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్ బాషా, నాయకులు నాగభూషణంరెడ్డి, ఝాన్సీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకం హుండీ ఆదాయం రూ.1.33 కోట్లు


హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారికి హుండీలో భక్తులు సమర్పించిన కానుకల రూ.1.33 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. భక్తులు గత 16 రోజులుగా స్వామివారి హుండీ సమర్పించిన కానుకలను బుధవారం ఉదయం స్వామివారి ఆస్థాన మండపంలో లెక్కించారు. ఇందులో 32 గ్రాముల బంగారం, 2,100 గ్రాముల వెండి, యూఎస్ఏ కరెన్సీ 528 డాలర్లు, ఇంగ్లాండ్ 40 పౌండ్లు, యూఏఈ 30 దీరమ్స్, ఆస్ట్రేలియా 45 డాలర్లు, కెనడా 10 డాలర్లుతో కలిపి మొత్తం రూ.1.33 కోట్లు ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, హేమమాలిని, పర్యవేక్షకులు శ్రీధర్‌బాబు, కోదండపాణి, రవి, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా మురిపించెన్

ఏ ఆదరణలేని ఆపన్నులకు ఆసరాగా నిలుస్తోంది సర్కారు.. ఎన్నికల హామీ మేరకు ఏటా పింఛన్ మొత్తం పెంపుతో పాటు అర్హత ఉన్న కొత్త వారికి పింఛన్లు మంజూరు చేస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి రూ.250 పెంచడంతో పాటు మరెందరో అభాగ్యులను ఆదుకుంది. ఈ క్రమంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో లబ్ధిదారులు వారోత్సవాలు జరుపుకుని కేక్ కటింగ్‌లు, సీఎం చిత్రపటాలకు పాలాభిషేకాలు చేసి సంబరాలు జరుపుకుంటున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


శ్రీకాళహస్తిలో జరిగిన పెన్షన్ వారోత్సవాల్లో వృద్ధులకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి


చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయంలో పింఛన్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


శాంతిపురం మండలం అలకలదొడ్డి గ్రామంలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్సీ భరత్


బంగారుపాళెంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు


రాపూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి


చంద్రగిరిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు, పక్కన ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి


కోట మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు


వరదయ్యపాళెంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం


తిరుపతి 27వ డివిజన్‌లో పింఛన్‌ను అందజేస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శిరీష

టీడీపీ దాడిలో గాయపడిన ఎంపీటీసీ సభ్యుడికి ఆర్థిక సాయం

- వైద్యఖర్చులకు మంత్రి పెద్దిరెడ్డి చేయూత
- నగదు అందజేసిన రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి


ఆర్థిక సహాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తదితరులు

చౌడేపల్లె: తెలుగుదేశం పార్టీ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడిన గడ్డంవారిపల్లె ఎంపీటీసీ సభ్యుడు టి.శ్రీరాములు, సర్పంచ్ భాగ్యవతి ఆమె భర్త హరిప్రసాద్‌కు రూ.లక్ష నగదు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి చౌడేపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో బాధితులను పరామర్శించి, నగదు అందజేశారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ నాలుగు రోజుల ముందు తెల్లనీళ్లపల్లెలో టీడీపీ నాయకులు రమేష్‌రెడ్డి తదితరులు కలిసి వైఎస్సార్ సీపీ నాయకులపై దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. దాడిలో గాయపడిన బాధితులు మెరుగైన వైద్యం పొందేందుకు మంత్రి ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు శ్రీరాములుకు రూ.50 వేలు, సర్పంచ్ భర్త హరిప్రసాద్‌కి రూ.50 వేలు చొప్పున నగదు అందజేశారు. తమ కుటుంబానికి ఉన్న ప్రజాదరణ చూసి, ఓర్వలేక రోజుకొక ఎత్తుగడ వేస్తూ టీడీపీ, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తోందన్నారు. ఎక్కడ ఏ సంఘటన జరిగినా మంత్రితోపాటు తమ కుటుంబం, వైఎస్సార్ సీపీకి అంటగట్టడం ఎల్లోమీడియాకు పరిపాటిగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, మంత్రి పీఏ మునితుకారం, పాల ఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ లడ్డూ రమణ, మాజీ ఎంపీపీలు రుక్మిణమ్మ, అంజిబాబు, సర్పంచ్ వరుణ్ భరత్, రైతు సంఘం మండల అధ్యక్షుడు వెంకటరమణ, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలంటే రచ్చేనా!

- టీడీపీ ప్రచార రథానికి అనుమతి లేదన్న పోలీసులు
- ఆ సాకుతో ఆందోళనకు దిగిన టీడీపీ నేతలు


టీడీపీ ప్రచార రథానికి అనుమతులు తీసుకోవాలని చెబుతున్న పోలీసులు

పలమనేరు: పోలీసులను టార్గెట్ చేస్తూ మైలేజీ సాధించాలన్నదే టీడీపీ ప్రధాన వ్యూహంగా మారింది. పార్టీ పెద్దల నుంచి వస్తున్న ఆదేశాలను స్థానిక నాయకులు తూ.చా. తప్పకుండా పాటిస్తున్నారు. ఆ మేరకు పలమనేరు పట్టణంలోని మదనపల్లె రోడ్డులో టీడీపీ ప్రచారరథం కుప్పానికి బయలుదేరగా విషయం తెలుసుకున్న ఎస్ఐ నాగరాజు తమ సిబ్బందితో కలసి ఆ వాహనాన్ని అడ్డుకున్నారు. అక్కడున్న టీడీపీ నాయకులు ప్రభుత్వ నిబంధనలు, అవసరమైతే ఎలా అనుమతులు పొందాలని, విపులంగా వివరించే ప్రయత్నం చేశారు. తాము చంద్రబాబు సమావేశానికి ప్రచారరథాన్ని తీసుకెళ్లడం లేదని, టీడీపీ కార్యాలయం వద్దకు తీసుకెళుతున్నామని ఆ పార్టీ పలమనేరు పట్టణ అధ్యక్షుడు బలరామ్‌కుట్టి పోలీసులకు సమాధానం ఇచ్చారు. ఆపై ఉన్నట్టుండి పోలీసుల కావాలనే తమ ప్రచార రథాన్ని అడ్డుకున్నారంటూ సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టి, సమస్య సృష్టించి.. పెద్దది చేయాలని చూశారు. ఇంతలో అక్కడకు చేరుకున్న ఆ పార్టీ శ్రేణులు పోలీసులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. రాష్ట్రంలో ప్రజాసామ్యం లేదంటూ విమర్శించారు. ప్రశాంతంగా ఉన్న పట్టణంలోనూ టీడీపీ నాయకులు ఏదో విధంగా చిచ్చు పెట్టి, రాజకీయాలు చేయడం ఏమిటని స్థానికులు మాట్లాడుకుంటున్నారు. పార్టీ పరంగా సభలు, సమావేశాలకు దరఖాస్తు చేస్తే తప్పకుండా అనుమతులిస్తామంటూ పోలీసులు విన్నవిస్తున్నా ఆ పార్టీ శ్రేణులు చేస్తున్న హంగామాను చూసి, జనం ఇదేమి రాజకీయాలురా.. సామీ అంటూ ఆశ్చర్యపోతుండడం గమనార్హం.

బావిలో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం


వృద్ధురాలి మృతదేహం

నగరి : గుండ్రాజుకుప్పం గ్రామంలోని వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం తేలియాడుతూ కనిపించిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గుండ్రాజుకుప్పం గ్రామానికి సమీపంలో ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావి ఉంది. బుధవారం మధ్యాహ్నం ఆయన మోటారు వేయడానికి బావి వద్దకు వెళ్లాడు. బావిలో వృద్ధురాలి మృతదేహం తేలుతూ ఉండటం గమనించి విషయం గ్రామస్తులకు తెలపడంతో అందరూ బావి వద్దకు పరుగులు తీశారు. పోలీసులకు సమాచారం అందించి, మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలికి 55 ఏళ్లకు పైగా వయస్సు ఉంటుంది. తెలుపు, రోజ్ రంగు మచ్చలున్న చీర, ఆరెంజ్ కలర్ జాకెట్ ధరించి ఉంది. మెడలో తాళిబొట్టు ఉంది. తమ గ్రామానికి చెందిన మహిళ కాదని సర్పంచ్ బాలప్రసాద్ తెలిపారు. మరో ప్రాంతం నుంచి వచ్చిన మహిళ బావిలో పడి ఆత్మహత్య చేసుకుందా? వేరే పనుల నిమిత్తం వచ్చి పొరబాటున బావిలో జారిపడిందా? అన్న వివరాలు తెలియడం లేదు. మహిళ వివరాల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఆరులేన్ల రహదారి నుంచి కాణిపాకానికి లింకురోడ్డు


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

కాణిపాకం(యాదమరి): ఆరులేన్ల రహదారి నుంచి కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వరకు లింకు రోడ్డు ఏర్పాటుకు పనులు వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ రహదారుల శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ కాణిపాకానికి విచ్చేశారు. గతంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు రాష్ట్ర రోడ్డు రవాణా కార్యదర్శి ప్రద్యుమ్నకు ఈ విషయమై విన్నవించారు. దీనిపై జిల్లా కలెక్టర్ బుధవారం మధ్యాహ్నం బెంగళూరు విజయవాడ ఆరులేన్ల జాతీయ రహదారి నుంచి కాణిపాకం ఆలయానికి లింకురోడ్డు ఏర్పాటు చేయడానికి నత్తపుచేను వద్ద స్థలాన్ని పరిశీలించారు. లింకురోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఈఈ వెంకటనారాయణ, చిత్తూరు ఆర్డీఓ రేణుక పాల్గొన్నారు.

ఎస్ఎన్‌జే షుగర్ ఫ్యాక్టరీని సందర్శించిన కలెక్టర్

శ్రీరంగరాజపురం: మండలంలోని ఎస్ఎన్‌జే షుగర్ ఫ్యాక్టరీని జిల్లా కలెక్టర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం సందర్శించారు. ఫ్యాక్టరీ ఇన్‌చార్జి సదాశివం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లను సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఫ్యాక్టరీ నిర్వాహణ గురించి, అడిగి తెలుసుకున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 20 వేల మందికి పైగా రైతులు ఫ్యాక్టరీపై ఆధారపడి ఉన్నారని, రోజుకు 4వేల టన్నులకుపైగా క్రషింగ్ జరుగుతుందని ఫ్యాక్టరీ ఇన్‌చార్జి ఈ సందర్భంగా కలెక్టర్, జేసీలకు వివరించారు. అలాగే ఏటా 9లక్షల మెట్రిక్ టన్నులకు పైగా చెరుకు క్రషింగ్ జరుగుతుందన్నారు. తద్వారా 500 మందికి పైగా వాహన యజమానులు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. ఫ్యాక్టరీలో 550 మందికి పైగా ఉద్యోగులున్నారని కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం వారు ఫ్యాక్టరీలోని అన్ని విభాగాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కేన్ ఇన్‌స్పెక్టర్ జాన్ విక్టర్, తహసీల్దార్ షబ్బీర్‌బాషా ఉన్నారు.

9న అప్రెంటిస్‌షిప్ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్ : పద్మావతిపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వి.శ్రీలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ స్కిల్ ఇండియా, మేకిన్ ఇండియాలో భాగంగా చేపట్టనున్న మేళాలో వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అర్హులైన అభ్యర్థులకు అప్రెంటిస్‌షిప్ అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు అప్రెంటిస్ షిప్ సలహాదారు ఎం.సెల్వరాజ్‌ను 92937 41997, 99595 53093 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రక్షణ కవచం.. ఎంసీసీబీ

అధునాతన పరికరం.. దీని వినియోగంతో ట్రాన్స్‌ఫార్మర్లకు షార్ట్ సర్క్యూట్.. ప్రమాదాల నివారణ, ఫ్యూజ్ కాలిపోయే సమస్యలకు చెక్.. అదే మోల్డ్ కేస్ సర్క్యూట్ బ్రేకర్ (ఎంసీసీబీ). ఈ పరికరం ఏర్పాటుతో ఎస్పీడీసీఎల్ విద్యుత్ సమస్యలకు మంగళం పలకనుంది. ఈ విధానాన్ని జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేసింది. దీనిపై కథనం.

- ప్రయోగాత్మకంగా ట్రాన్స్‌ఫార్మర్లకు అమరిక
- జిల్లాలో తొలిదశలో 100 ఏర్పాటు


ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసే ఎంసీసీబీని పరిశీలిస్తున్న డిస్కం సీజీఎం చలపతి (ఫైల్)

చిత్తూరు కార్పొరేషన్: ఇళ్లు, వాణిజ్య సర్వీసుల్లో ఉండే మోల్డ్ కేస్ సర్క్యూట్ బ్రేకర్(ఎంసీసీబీ)ని జిల్లాలోని ట్రాన్స్‌ఫార్మర్లకు అమర్చుతున్నారు. సాధారణంగా నివాసాల్లో లైన్ ట్రిప్ అయినా లేదా సాంకేతిక సమస్యలు వస్తే ఆటోమేటిక్‌గా ఎంసీసీబీలోని స్విచ్‌లు ఆఫ్ అయి, వాటి ద్వారా ఆ గదికి విద్యుత్ సరఫరా ఆగిపోతుంది. తర్వాత సమస్యను పరిశీలించి పరిష్కరిస్తున్నారు. ఆ విధానాన్ని డిస్కం(రాయలసీమ, నెల్లూరు జిల్లాలు) పరిధిలో ప్రయోగాత్మకంగా (పైలట్) డీటీఆర్ (డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్)లకు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కొక్క ఎంసీసీబీ విలువ రూ.27 వేలు కాగా రూ.27 లక్షల వ్యయంతో తొలిదశలో జిల్లాలో వంద యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా స్టోర్‌లో ఉన్న వీటిని డిస్కం (రాయలసీమ, నెల్లూరు జిల్లాల) చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) చలపతి, డీఈ జయప్రకాష్‌తో కలిసి ఇటీవల పరిశీలించారు.

ప్రస్తుతం


విద్యుత్ వినియోగదారులకు సరఫరా సాధారణంగా 220, 132, కేవీ సబ్‌స్టేషన్ల నుంచి 11 కేవీ లైన్ల ద్వారా 100, 160, 250, 315 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లకు సరఫరా వస్తుంది. వాటి నుంచి గృహ, వాణిజ్య, పరిశ్రమలకు సరఫరా చేస్తున్నారు. సరఫరా సమయంలో లైన్లు ఒకదానికొకటి తగలడం, ట్రాన్స్‌ఫార్మర్లపై చెట్లు పడడం, ఫ్యూజ్‌పై జంతువులు పడడం, వైండింగ్ వైర్ కాలడం తదితర ఇబ్బందులతో సాంకేతికంగా సమస్య ఏర్పడి, ఫ్యూజ్ పోవడం, లైన్‌ట్రిప్ కావడం జరుగుతోంది. వేసవిలో అయితే వేడికి ట్రాన్స్‌ఫార్మర్‌లోని అయిల్ బయటకు వచ్చి, సరఫరాలో అంతరాయం కలుగుతోంది. అప్పుడప్పుడు ఫ్యూజ్ పోతుంటాయి. వాటిని మార్పు చేయడం ఖర్చు, సమయంతో కూడిన పని.


సంతపేటలో ఏర్పాటు చేసిన ఎంసీసీబీ

భవిష్యత్‌లో..

వీధుల్లో ఉండే ట్రాన్స్‌ఫార్మర్లకు ఎంసీసీబీని క్లాంప్, బోల్ట్ సాయంతో అమర్చి అనుసంధానం చేస్తారు. అనంతరం క్షేత్రస్థాయిలో ఎటువంటి సాంకేతిక సమస్యలు, ఇబ్బందులు వచ్చినా ఆటోమేటిక్‌గా ఎంసీసీబీలోని స్విచ్‌లు ఆఫ్ అవుతాయి. అప్పుడు లైన్‌మన్ వచ్చి సమస్యను పరిష్కరిస్తారు. దీంతో సమయం సైతం ఆదా అవుతుంది. చిత్తూరులో సంతపేట, మిట్టూరు, గిరింపేట, కొంగారెడ్డిపల్లె ప్రాంతాల్లో వీటిని ప్రయోగాత్మకంగా అమర్చారు. ఇలాగే జిల్లాలో వీటి ఏర్పాటు పనులు జరుగుతున్నాయి.

ప్రయోగాత్మకంగా అమలు



ట్రాన్స్‌ఫార్మర్లకు ఎంసీసీబీలను ప్రయోగాత్మకంగా అమర్చుతున్నారు. ఇది చక్కటి ఉద్దేశం. విద్యుత్ సరఫరాలో లోటుపాట్లు ఉంటే ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. మరమ్మతు, సమస్యలు వస్తే ఎంసీసీబీలోని స్విచ్‌లు ఆఫ్ అవుతాయి. దీంతో సిబ్బంది క్షేత్రసాయిలో వెళ్లి సమస్యను పరిష్కరిస్తారు.

– పద్మనాభపిళ్లై, ఇన్‌చార్జి ఈఈ చిత్తూరు ట్రాన్స్‌కో